




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 9 సంచిక : 277 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 10 జూన్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :277 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | WED 10 JUNE 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ‘మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి

### క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను

- విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- విశాఖలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన లోకేష్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, శాశ్వత ఉద్యోగం హామీ
- కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్ర మంత్రి లోకేష్ పరామర్శ
- ప్రమాద కారణాలపై ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలంటూ ఆసుపత్రిలో క్షతగాత్రుడి విజ్ఞప్తి

- మిగతా 2లో

## నేడు విశాఖ వెళుతున్న జగన్..

### స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ

- మొన్న విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- ఎనిమిది మంది కార్మికుల దుర్మరణం
- ఘటనపై ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జగన్



పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను, అలాగే గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ రేపు విశాఖలో పర్యటించనున్నారు. ఈ ప్రమాదంపై జగన్ ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఆయన స్పందిస్తూ... బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని స్థానిక వైసీపీ నాయకులను

- మిగతా 2లో



## హైదరాబాద్ లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ
- ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

పెన్ పవర్ డెస్క్:నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు

- మిగతా 2లో



## బాణసంచా గోదాంలో భారీ పేలుడు..

### ఏడుగురు కార్మికులు సజీవ దహనం

పెన్ పవర్ డెస్క్:రాజస్థాన్ రాష్ట్రంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. మంగళ వారం (జూన్ 9) జైపూర్‌లోని ఓ అక్రమ బాణసంచా గోదాంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు సజీవ దహనం అయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం

- మిగతా 2లో



# వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

## పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్

- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేం దుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికా రులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో

- మిగతా 2లో



## వైసీపీ ‘శవ రాజకీయాలు’ చేస్తోంది

- విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించిందన్న నారాయణ
- సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ ఘటనను పర్యవేక్షిస్తున్నారని వెల్లడి
- 2029 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు మళ్లీ గుణపాఠం చెబుతారని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించిందని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న ఆయన, ఈ ప్రమాదం నేపథ్యంలో తాను తిరుపతిలో పాల్గొనాల్సిన అధికారిక కార్యక్రమాన్ని కూడా రద్దు చేసుకున్నట్లు వివరించారు. బాధితులకు మెరుగైన వైద్యం, తక్షణ సహాయక చర్యలు

- మిగతా 2లో



## ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై హైకోర్టు ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్: ప్రభుత్వ భూములకు నకిలీపట్టాల సృష్టిపై సిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఖానామెట్ భూములకు నకిలీ పట్టాలు సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ భూమి తనదంటూ పిటిషన్ దాఖలు చేసిన ఇట్టిగా ప్రాపర్టీస్‌కు రూ. 5లక్షల జరిమానా

- మిగతా 2లో

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు



- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమన్న బొత్స
- బాధితులు కోరుతున్న పరిహారం ఇవ్వాలని వ్యాఖ్య
- మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్

- మిగతా 2లో

## ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి

- ఆసుపత్రిలో ఉన్న కుటుంబ పెద్దను చూసేందుకు వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న బంధువులు
- ఈ విషయం తెలియకుండానే, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కన్నుమూత
- ప్రమాదంతో గుర్గావ్ అగర్వాల్ కుటుంబంలో ఎవరూ మిగలకుండా పోయిన వైనం
- హోటల్ యాజమాని, వంట మనిషిని అరెస్ట్ చేసిన పోలీసులు

- మిగతా 2లో



### తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

## రాజ్య సభ నామినేషన్ తిరస్కరణ

పెన్ పవర్ డెస్క్: రాజ్య సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైంది. తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసు వివరాలను నామినేషన్‌లో ఆమె వెల్లడించలేదని బీజేపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల సంఘం (ఈసీ) ఈ నిర్ణయం తీసుకుంది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో బీజేపీ అభ్యర్థి ఎన్నిక

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# బెజవాడలో కమ్యునిస్టులు ఎక్కడ? నాడు శాసించి... నేడు

విజయవాడ అంటే ముందుగా గుర్తుకొచ్చేది కమ్యునిస్టులు. ఒకప్పుడు బెజవాడలో కమ్యునిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. విజయవాడ నగరంలో ఎక్కువగా కమ్యునిస్టు ఓటు బ్యాంకు ఉండేది. సీపీఎం, సీపీఐ బలంగా ఉండేవి. విజయవాడ నగర పాలక సంస్థను కూడా కమ్యునిస్టులు చేజిక్కించుకున్నారు. 1981 నుంచి 1999 వరకూ నగరపాలక సంస్థలో కమ్యునిస్టులు రాజ్యమేలారు. అన్ని డివిజన్లపై పట్టుండేది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సీపీఐ పలుమార్లు విజయం సాధించింది. కానీ 1999 లో టి. వెంకటేశ్వరరావు చివరి మేయర్ గా కమ్యునిస్టుల తరుపున పనిచేశారు. తర్వాత ఇంత వరకూ కార్పొరేషన్ కూడా దక్కలేదు.

**మారుతున్న పరిస్థితుల్లో...**

మారుతున్న రాజకీయ పరిస్థితుల కారణంతో కమ్యునిస్టుల ఓటు బ్యాంకు కూడా చెల్లాచెదురయినట్లు కనిపిస్తుంది. విజయవాడలో కమ్యూనిస్టులు పూర్తిగా కనుమరుగయ్యారని చెప్పలేం కానీ, వారి ప్రాభవం మాత్రం కాలక్రమేణా భారీగా తగ్గిపోయింది. ఒకప్పుడు బెజవాడను శాసించిన కమ్యూనిస్టు పార్టీలు, నేడు స్వతంత్రంగా గెలిచే స్థాయిని కోల్పోయి, ప్రధాన పార్టీలతో పొత్తుల మీదే ఆధారపడే స్థితికి చేరుకున్నాయి. బెజవాడలో కమ్యూనిస్టుల పరిస్థితికి సంబంధించిన ముఖ్య విషయాలు:దశాబ్దాల క్రితం ఆధిపత్యం: స్వాతంత్రోద్యమ కాలంలో, ముఖ్యంగా 1934లో విజయవాడలోనే ఆంధ్రా కమ్యూనిస్టు ఉద్యమం పురుడు పోసుకుంది. 1980లు, 90ల వరకు నగరపాలక సంస్థలో తిరుగులేని శక్తిగా ఉండేవి. విజయవాడకు తొలి మేయర్‌గా సీపీఐ నేత టి.వెంకటేశ్వరరావు పనిచేయడం దీనికి నిదర్శనం.

**ఆధిపత్య పోరుతోనే...**

సీపీఐ, సీపీఎంల మధ్య ఆధిపత్య పోరు, కార్మిక సంఘాల్లో తగ్గిన పట్టు, మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల నగరంలో వీరి ఓటు బ్యాంకు గణనీయంగా పడిపోయింది. ప్రత్యక్ష ఎన్నికల్లో విజయాలు అంతంత మాత్రమే అయినప్పటికీ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరసనలు, పోరాటాల్లో వామపక్షాలు ఇప్పటికీ క్రియాశీలకంగానే పనిచేస్తున్నాయి. అయినా సరే కమ్యునిస్టులు గెలిచేటంతగా తమ బలాన్ని పెంచుకోలేకపోతున్నాయి. ప్రజాసమస్యలపైన, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నప్పటికీ కమ్యునిస్టులకు ఓట్లు రాలడం లేదు. దీంతో పట్టున్న బెజవాడ నగరం ఎర్రన్న చేతుల్లో నుంచి చేజారిపోయినట్లే కనిపిస్తుంది. ఇక పుంజుకునే అవకాశాలు కూడా కనిపించడం లేదు. టీడీపీ, వైసీపీ, బీజేపీలు క్రమంగా బలపడటంతో కమ్యునిస్టుల ఓటు బ్యాంకు చెల్లాచెదురయింది.

# ‘మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనంగా రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, “అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్లైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత” అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు. ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. “నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ. 25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం” అని తెలిపారు.

ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు జరుగుతుందని లోకేష్ అన్నారు. “ఇది కింద నుంచి లీకవ్వలేదు, పైనుంచి పొంగలేదు. ద్రవ ఉక్కు బయటకు కక్కినట్లుగా ఉంది. దీని వెనుక కారణాలను నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేశారు. వారు ఈరోజే విశాఖ వచ్చి కార్మికులతో మాట్లాడి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయి” అని వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన ఓ సంఘటనను లోకేష్ ఉద్వేగంగా పంచుకున్నారు. “గాయపడిన శ్రీనివాస్ అనే కార్మికుడిని పరామర్శిస్తే, ఆయన తన ఆరోగ్యం గురించి కాకుండా ‘అయ్యా, మమ్మల్ని కాదు, దయచేసి విశాఖ ఉక్కును కాపాడండి. లక్షలాది కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి’ అని వేడుకున్నాడు. ఆ మాటలు కార్మికులకు ఫ్యాక్టరీతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశాయి. ఆయన మాటలు నన్ను కదిలించాయి” అని అన్నారు. గతంలో వాజ్‌పేయి, చంద్రబాబు హయాంలో రూ. 15 వేల కోట్ల ప్యాకేజీతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కార్మికుల కుటుంబాలకు అదే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్రకు రానున్న భారీ పెట్టుబడుల నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, యువతకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని లోకేష్ హామీ ఇచ్చారు.

## ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి

ఢిల్లీలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాద విషాదంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తన కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని కోల్పోయిన 80 ఏళ్ల రాధే శ్యామ్ అగర్వాల్, ఆ చేదు నిజం తెలియకుండానే మంగళవారం కన్నుమూశారు. దీంతో గురుగ్రామ్‌కు చెందిన అగర్వాల్ కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది.

శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రాధే శ్యామ్ అగర్వాల్ ఢిల్లీలోని సాకేత్ మాక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను చూసుకునేందుకు గురుగ్రామ్‌లో నివసించే ఆయన కుమారుడు వివేక్ అగర్వాల్, కోడలు, మనవరాళ్లతో సహా మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఢిల్లీకి వచ్చారు. వీరంతా ఆసుపత్రికి సమీపంలోని మాల్వియా నగర్‌లో ఉన్న ‘ఫ్లరిష్ స్టే’ అనే హోటల్‌లో బస చేశారు.

జూన్ 3న ఉదయం 8:30 గంటల సమయంలో ఆ హోటల్‌లోని వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వివేక్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఎనిమిది మందితో పాటు మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. తన కుటుంబానికి ఇంతటి ఘోరం జరిగిందన్న విషయం తెలియని రాధే శ్యామ్, తన వాళ్లెవరూ పలకరించడానికి రావడం లేదని ఆసుపత్రి సిబ్బందిని నిరంతరం ఆరా తీస్తుండేవారు. చివరకు ఆయన కూడా చికిత్స పొందుతూ మృతి చెందడంతో, ఆ కుటుంబంలో ఒక్కరు కూడా మిగలకుండా పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, హోటల్ యజమాని లవకేశ్ బజాజ్, వంట మనిషి కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా నిబంధనల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ దుర్ఘటనతో గురుగ్రామ్‌లోని అగర్వాల్ కుటుంబ నివాసం మూగబోయింది.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజులతో కూడిన బృందం పరామర్శించింది. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ... ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధితులు కోరుతున్న పరిహారం గొంతెమ్మ కోరిక కాదని, ప్రభుత్వం వారి డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్టీల్‌ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టేందుకు, ప్రైవేటీకరణ చేసేందుకే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ కుట్రల వల్లే ప్లాంట్‌లో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆరోపించారు.

స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని బొత్స విమర్శించారు. ఇప్పటికే దాదాపు 10 వేల మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని, ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ‘ఎల్జీ పాలిమర్స్’ తరహాలో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చి చెప్పారు. అలాగే, బాధితులను పరామర్శించేందుకు జగన్ రేపు విశాఖలో పర్యటిస్తారని వెల్లడించారు.

## బాణసంచా గోదాంలో భారీ పేలుడు.. ఏడుగురు కార్మికులు సజీవ దహనం

మొదటి పేజి తరువాయి

అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించారు. జైపూర్‌లోని తలాయ్ కాలనీలో అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన ఓ ఇంట్లో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. భారీ పేలుడు తర్వాత మంటలు వేగంగా వ్యాపించడంతో పలువురు కార్మికులు లోపల చిక్కుకుపోయారని తెలిపారు. ఏడుగురూ కాలిన గాయాలతో మరణించారని జైపూర్ ఏసీపీ వినోద్ శర్మ ధృవీకరించారు.

వీరిలో ఐదుగురు ఎస్ఎంఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా.. ఒకరు అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మరొకరు ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. మృతులను సమీర్, ఆబిద్, నాసిర్, అబ్దుల్ వాహిద్, బిలాల్‌గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిల్వ ఉంచిన అత్యంత మండే స్వభావం గల పదార్థం పేలుడుకు కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. పేలుడు తర్వాత భారీగా ఎగసిపడుతోన్న మంటల నుంచి తప్పించుకోవడానికి కార్మికులు పరుగులు తీయడంతో అక్కడ భయానక వాతావరణం నెలకొందని ప్రత్యక్ష సాక్షులు వివరించారు. అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి లోపల చిక్కుకున్న పలువురిని బయటకు తీశారు. కాగా, ఈ ఘటనపై రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, మాజీ సీఎం అశోక్ గ్లెహాట్ సంతాపం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై హైకోర్టు ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

విధించింది. నకిలీ పట్టాల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపైనా సీఐడీ దర్యాప్తునకు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఐపీఎస్ అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశాలు ఇచ్చారు. గతంలో టీజీఐఐసీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ ఇట్టిగా ప్రాపర్టీస్ అనే సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. ఖానామెట్‌లో 15 ఎకరాలను కొనుగోలు చేశామని పిటిషన్ వేసింది. అయితే, ఖానామెట్‌లో ఈ భూమిని 1997లోనే టీజీఐఐసీకి ప్రభుత్వం కేటాయించడం గమనార్హం.

## వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

- మొదటి పేజి తరువాయి

పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు.

2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు ‘మల్టిప్లైయర్ ఎఫెక్ట్’ తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## నేడు విశాఖ వెళుతున్న జగన్..

- మొదటి పేజి తరువాయి

ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ శ్రేణులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నిన్న సాయంత్రం స్టీల్‌ప్లాంట్‌లో ఒక పెద్ద పేలుడు సంభవించింది. 150 టన్నుల లాడిల్ నుండి కరిగిన ఉక్కు ఒక్కసారిగా కిందపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా... మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

## హైదరాబాద్ లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- మొదటి పేజి తరువాయి

జిల్లాలకు భారత వాతావరణ శాఖ ‘ఎల్లో అలర్ట్’ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం కూడా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**హైదరాబాద్‌లో భారీ వర్షం**

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న భాగ్యనగరవాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రాంనగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముషీరాబాద్‌తో పాటు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## వైసీపీ ‘శవ రాజకీయాలు’ చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

అందించడంపైనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనను పర్యవేక్షిస్తున్నారని నారాయణ పేర్కొన్నారు. అయితే, ఈ విషాదాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ దారుణమైన శవ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన, 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు మళ్లీ తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇక గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన 56 ఫిర్యాదుల్లో 60 శాతానికి పైగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల వల్లే ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని, వీటి పరిష్కారానికి మంత్రుల కమిటీ పనిచేస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నారని, వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

## తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్య సభ నామినేషన్ తిరస్కరణ

- మొదటి పేజి తరువాయి

ఏకగ్రీవమైంది. కాగా, మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్య సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం రెండు స్థానాలను బీజేపీ సునాయాసంగా కైవసం చేసుకోనుండగా.. ఒక స్థానం కాంగ్రెస్?కు దక్కే అవకాశం ఉంది. ఈ మూడో సీటు కోసం కాంగ్రెస్ తరుపున మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే, హైదరాబాద్?లో నమోదైన క్రిమినల్ కేసు వివరాలు, ఆస్తులు, బ్యాంక్ లావాదేవీల వివరాలను ఉద్దేశపూర్వకంగానే మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాల్లో దాచిపెట్టారని బీజేపీ అభ్యర్థి ఈసీకి ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదును పరిశీలించిన రిటర్నింగ్ ఆఫీసర్ మీనాక్షి నటరాజన్ నామినేషన్?ను రిజెక్ట్ చేశారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ పరిశీలన ప్రక్రియలో తిరస్కరణకు గురి కావడంతో మధ్యప్రదేశ్?లోని మూడవ రాజ్యసభ స్థానానికి కూడా పోటీ ముగిసింది. బీజేపీ అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఈసీ ప్రకటించింది. నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా పోరాటం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

## అన్నవరం భక్తులకు ఉచితంగా 'శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రాలు' పుస్తకాల వితరణ



**అన్నవరం:పెన్ పవర్ జూన్ 9:**రత్నగిరిపై వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచితంగా పంపిణీ చేసేందుకు 10,000 'శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రములు' పుస్తక ప్రతులను దేవస్థానానికి అందజేశారు.

శ్రీశైలం క్షేత్ర పూర్వపు ప్రత్యేక సలహాదారు, 'జ్ఞాన మహాయజ్ఞ కేంద్ర' వ్యవస్థాపకులు శ్రీ పురాణపండ శ్రీనివాస్ గారి సౌజన్యంతో, దాతలు శ్రీ పాణింగపల్లి శ్రీనివాస్ - వాణి దంపతులు ఈ పుస్తకాలను సమకూర్చారు. ఈ ప్రతులను అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీ నల్లం సూర్య చక్రధర్ రావు గారికి వారు ఘనంగా అందజేశారు.

ఈ సందర్భంగా దాతలను, నిర్వాహకులను దేవస్థానం అధికారులు అభినందించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ స్తోత్ర పుస్తకాలు ఎంతో ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు

పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# మడ అడవుల విస్తరణతో పాటు తీరప్రాంత ప్రజల జీవనోపాధి పెంపుపై ప్రత్యేక దృష్టి






- అధికారుల సమన్వయంతో జీసీఎఫ్ లక్ష్యాలను సాధించాలి
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ,పెన్ పవర్ జూన్ 9**: తీరప్రాంత పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యకారులు,వెనుకబడిన వర్గాలు, ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు, రెవెన్యూ, మత్స్యశాఖ,డీఆర్డీఏ తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. కేంద్ర పర్యావరణ,అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ మరియు ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) సంయుక్త సహకారంతో హరిత వాతావరణ నిధి (జీసీఎఫ్) ద్వారా కొరింగ వన్యప్రాణి అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో అమలు చేస్తున్న వాతావరణ అనుకూల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి ఎన్. రామచంద్రరావు ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు సాధించిన పురోగతిని వివరించారు. జిల్లాలో వందలాది హెక్టార్లలో మడ అడవుల పునరుద్ధరణ విజయవంతంగా పూర్తికాగా, మత్స్య ఉత్పత్తుల విలువ ఆధారిత తయారీ, సముద్ర నాచు పెంపకం వంటి అంశాలపై లబ్ధిదారులకు శిక్షణలు అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 జీసీఎఫ్ కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాల సాధనకు అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ ఏడాది అదనంగా 115 హెక్టార్లలో మడ అడవుల పెంపకం చేపట్టడంతో పాటు, ఇప్పటికే పునరుద్ధరించిన 180.58 హెక్టార్ల మడ అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

స్థానిక మహిళలు, వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రంగు చేపల పెంపకం, సముద్ర నాచు సాగు,పీతల పెంపకం యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వాతావరణ అనుకూల జీవనోపాధిపై ప్రత్యేక శిక్షణలు అందించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనుమతులు లభించిన వెంటనే సముద్రపు పంజరాలలో చేపల పెంపకం, సమగ్ర తెగుళ్ల నివారణ ప్రదర్శనలు, నేల సంరక్షణ కార్యక్రమాలు, చిరుధాన్యాల సాగు విస్తరణ, తోటపని మొక్కల పెంపకం వంటి వినూత్న కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్వేరియం మరియు ఇతర మోడల్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన డీపీఆర్‌లు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్. మల్లిబాబు, పి. కృష్ణారావు, మత్స్యశాఖ అధికారి కె. కృష్ణారావు, డీఆర్డీఏ ఏపీడీ జిలానీ, పాడా ఏపీడీ వశంత మాధవి, ఫారెస్ట్ రేంజ్ అధికారులు వరప్రసాద్, శ్రీదీప్తి, జీసీఎఫ్ జిల్లా సమన్వయకర్త ఎల్. శ్రీహర్ష తదితర అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేయాలి





**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 9:** విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎస్ గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆర్ సి ఎస్, ఏఐఎఫ్టియు, పి ఓ డబ్లు (స్త్రీ విముక్తి), పిడిఎస్యు ( వి) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లి నగర్ లో మంగళవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఆర్ సి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పజెప్పడం వలన భద్రతా చర్యల లోపం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ ప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ నిర్వహించాలని, బాధ్యులపై హత్య నేరం, క్రిమినల్ కేసులను నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కెమికల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రకటించినట్లుగా కోటి రూపాయలు నష్టపరిహారాన్ని తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, 25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ సి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్, జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్ టు యు జిల్లా అధ్యక్షులు మడికి సత్యం, ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు, పిడిఎస్యు (వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) జిల్లా నాయకులు రెడ్డి దుర్గాదేవి, చింతపల్లి రత్నం, ఏపీ ఆర్ సి ఎస్ జిల్లా నాయకులు ఎల్లే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.




## జగ్గంపేట డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు సత్యలతకు ప్రతిభా పురస్కారం

**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 9:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ డి.సత్యలతకు తెలుగు భాషా పరిరక్షణకు, తెలుగు సాంప్రదాయ అభివృద్ధికి తెలుగు సంస్కృత వికాసానికి మీ సాహిత్య - కళా సృజనల ద్వారా చేస్తున్న సేవలను అభినందిస్తూ ప్రతిభా పురస్కారం పొందారు. జూన్ 7న రాజమహేంద్రవరంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సత్యలతను ప్రిన్సిపల్ డాక్టర్ డి. చెన్నారావు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో తుమ్మలపల్లి రమేష్ అన్నదానాలు



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 09:** జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ నేతృత్వంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 500 మందికి ఉచిత భోజనం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రజలకు సేవ చేయాలనే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలోని నిరుపేదలు, కూలీలు, అవసరమైన వారికి అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు తుమ్మలపల్లి రమేష్ స్వయంగా భోజనం వడ్డించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, పులి ప్రసాద్, ముత్యాల వెంకటరాజు,డ్రిల్ మాస్టారు, కొయ్యన ఉమామహేశ్వర రావు దంపతులు,రేవూరి శ్రీను, కొలమూరు భద్ర గోకేడ పండు తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ఈదురుగాలుల వల్ల దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు

ఎస్ఈ జి. ప్రసాద్





**కాకినాడ, పెన్ పవర్ జూన్ 9:** కాకినాడ సర్కిల్ పరిధిలో మంగళవారం సాయంత్రం సంభవించిన భారీ ఈదురుగాలులు,వర్షాల కారణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థకు గణనీయమైన నష్టం వాటిల్లినప్పటికీ, విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు కాకినాడ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) జి. ప్రసాద్ తెలిపారు.

సాయంత్రం 4 గంటల నుంచి 5:30 గంటల మధ్య తొండంగి,తుని, ప్రత్తిపాడు,ఏలేశ్వరం,శంఖవరం, రౌతులపూడి, కిర్లంపూడి మండలాల్లో ఆకస్మికంగా వీచిన బలమైన ఈదురుగాలుల ప్రభావంతో తాటి చెట్లు, భారీ వృక్షాలు విద్యుత్ లైన్లపై కూలిపోవడంతో సుమారు 200 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని ఆయన వెల్లడించారు.ఈ ఘటనల కారణంగా మొత్తం 60 విద్యుత్ 11 కేవీ ఫీడర్లు ప్రభావితమయ్యాయని, అందులో ఇప్పటికే 56 ఫీడర్లను పునరుద్ధరించి విద్యుత్ సరఫరా సాధారణ స్థితికి తీసుకొచ్చామని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన నాలుగు ఫీడర్ల పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.తుని, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరించామని, రౌతులపూడి,కిర్లంపూడి, తొండంగి మండలాల్లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మరో రెండు గంటల్లో అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తామని ఎస్ఈ జి. ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడి ఉండటం వంటి ప్రమాదకర పరిస్థితులు కనిపించినప్పుడు ప్రజలు వాటికి దూరంగా ఉండాలని,అలాగే విద్యుత్ సరఫరా అంతరాయాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ నంబర్ 1912కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తున్నారని,ప్రజలు సహకరించాలని ఎస్ఈ కోరారు.

## అన్నవరం అన్నదాన విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఈవో నల్లశీ సూర్య చక్రధరరావు






**అన్నవరం: పెన్ పవర్ జూన్ 9:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో భక్తులకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించేందుకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) నల్లశీ సూర్య చక్రధరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

ఇందులో భాగంగా ఆయన దేవస్థానంలోని నిత్య అన్నదాన విభాగాన్ని సందర్శించారు. భక్తులకు వడ్డించే అన్నప్రసాదాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించడమే కాకుండా, భోజనశాలలో కూర్చున్న భక్తుల వద్దకు వెళ్లి వారితో ముఖాముఖి మాట్లాడారు. అన్నప్రసాదం ఎలా ఉంది? దేవస్థానం వసతులు, సిబ్బంది ప్రవర్తన పట్ల సంతృప్తిగా ఉన్నారా? అని అడిగి తెలుసుకున్నారు.

?ఈవో చొరవపై భక్తులు సానుకూలంగా స్పందిస్తూ, ప్రసాదం నాణ్యత చాలా బాగుందని హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యమైన సేవలు అందించడమే దేవస్థానం ప్రథమ ప్రాధాన్యతని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

## శంఖవరం హైస్కూల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నవ చేతన ఇ సి డి స్క్రీనింగ్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం...

- సిడిపిఓ పి. వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్క రోజు శిక్షణ..
- ప్రత్యేక శిక్షణ అధికారిణి గా పాల్గొన్న అరుణ శ్రీ.





**శంఖవరం పెన్ పవర్ జూన్ 09:**-కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రమైన శంఖవరం జెడ్పీ హైస్కూల్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు నవచేతన లో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు
సిడిపిఓ పి. వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక శిక్షణ అధికారిణి గా అరుణ శ్రీ ముఖ్య అతిథిగా హాజరైయారు.
ముందుగా ప్రముఖుల చేతులు మీదుగా జ్యోతి ప్రజ్వలన చేపట్టారు.
అనంతరం ఒక్కరోజు శిక్షణలో భాగంగా ప్రతి చిన్నారి సమగ్ర అభివృదే లక్ష్యంగా తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తపై వివరించాలని ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు.
నవచేతన యాప్ ద్వారా పిల్లల అభివృద్ధిని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేసి, అభివృద్ధి ఆలస్యాలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు అవసరమైన విధానాలపై వారికి అవగాహన కల్పించారు. నవచేతన యాప్ ద్వారా ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదలను శాస్త్రీయంగా అంచనా వేసి,అభివృద్ధిలో ఏవైనా జాప్యాలను ప్రారంభ దశలోనే గుర్తించే విధానాలపై అవగాహనకల్పించారు.
పిల్లల జీవితంలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమని,ఈ దశలో సరైన పోషణ, ఆరోగ్య సంరక్షణ, అభ్యసన అవకాశాలు కల్పించడం ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని ఈ సందర్భంగా నవ చేతన ఈసీడి స్క్రీనింగ్ ప్రత్యేక శిక్షణ అధికారిణి అరుణ శ్రీ మరియు సిడిపిఓ పి. వెంకటలక్ష్మి తెలిపారు.
ఈ కార్యక్రమంలో
సూపర్వైజర్,బి. రజని, నాగమణి, మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# " బాలల గ్రామ సభలు పిల్లల గొంతుకను సమాజానికి వినిపించే వేదికలు....





**శంఖవరం /రౌతులపూడి పెన్ పవర్ జూన్ 09 :-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో రౌతులపూడి మండలం, శృంగవరం గ్రామ సచివాలయంలో జిల్లా మహిళా భివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సి.హెచ్. లక్ష్మి ఆదేశాల మేరకు, శంఖవరం ప్రాజెక్టు సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "కిషోరి వికాసం" సమ్మర్ క్యాంపెయిన్ లో భాగంగా కౌమార బాలికలు మరియు కౌమారబాల, బాలికలకు వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి జె. విజయ మాట్లాడుతూ, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "కిషోరి వికాసం" వేసవి సమావేశాలు మే 1వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. 11 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల కౌమార బాలికలు మరియు బాలురలో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.
ఈ సమావేశాలలో ఆరోగ్యం, పోషణ, వ్యక్తిత్వ వికాసం, విద్య యొక్క ప్రాముఖ్యత, లైంగిక మరియు ప్రజనన ఆరోగ్యం, బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ, జీవన నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై గ్రామ మరియు వార్డు స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌమార దశలో ఉన్న బాలబాలికలకు సరైన మార్గదర్శకత్వం అందించడం, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం మరియు సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి తోడ్పడటం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా చివరిగా నిర్వహించిన (సెషన్--12) లో భాగంగా "బాలల గ్రామ సభల ప్రాముఖ్యత మరియు గ్రామ సభల ఉద్దేశాలు" అనే అంశంపై అవగాహన కల్పించారు. బాలల గ్రామ సభ అనేది గ్రామంలోని పిల్లలు తమ అభిప్రాయాలు, సమస్యలు మరియు అవసరాలను స్వేచ్ఛగా వ్యక్తపరచుకునే వేదిక అని వివరించారు. ఇందులో పిల్లల విద్య, ఆరోగ్యం, రక్షణ, పరిశుభ్రత మరియు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించడం జరిగిందని తెలిపారు.అలాగే బాలల గ్రామ సభలు పిల్లల అభిప్రాయాలను తెలుసుకోవడం, బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం, పిల్లల్లో నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం మరియు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మికత్వం వంటి సామాజిక సమస్యలపై అవగాహన పెరిగి వాటి నివారణకు పిల్లలు, తల్లిదండ్రులు మరియు సమాజం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌమార బాలబాలికలు, అంగన్వాడీ సిబ్బంది మరియు ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి రైతు పైనా ఉంది.

-సాగుకు సమాయత్తం, కార్యక్రమంలో ఏఓ నాగం సుధామాదురి.




**కిర్లంపూడి, పెన్ పవర్,జూన్ 9:**భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి రైతు పైనా ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు.
కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో మంగళవారం సాగు సమాయత్తంతోపాటు ఖేత్ బచావో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఓ సుధామాధురి మాట్లాడుతూ ప్రస్తుతం మన సాగు భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని,దీని నిమిత్తం రైతులందరూ ఎరువులు మోతాదులు తగ్గించి వాడుకోవాలని సూచించారు. అలాగే పచ్చి రొట్ట విత్తనాలను అపరాలను వేసవిలో సాగు చేసుకోవాలని వివరించారు. రైతులకు ఎరువులు పంపిణీ లో వచ్చిన క్యూ ఆర్ కోడ్ విధానాన్ని తెలియజేశారు.ఈ సార్వాకు సాగు చేసుకోవాల్సిన రకాలను నీటి విడుదల వంటి అంశాలను చర్చించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఐ సి ఆర్ పి రంగబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పిఎండిఎస్ పథకం తోపాటు వివిధ కషాయాలు గురించి వివరించారు . ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీటీసీ పాఠంశెట్టి రవి,గ్రామ టిడిపి సీనియర్ నాయకులు కుంచే తాతాజీ, మూరా సత్తిబాబు, పాఠంశెట్టి అర్జున్ రావు,బాలుకుల సుబ్బారావు,బాలిన వెంకటేశ్వరరావు,గ్రామ ఉద్యాన సహాయకులు హరిత గ్రామ రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# శంఖవరం గ్రామం లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

**శంఖవరం వీఆర్వో తాటిపాక అచ్యుతం**

**శంఖవరం పెన్ పవర్ జూన్ 09 :-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా జూన్ 15, 2026 నుండి జూలై 14, 2026 వరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఇందులో భాగంగా శంఖవరం గ్రామంలోని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును భద్రపరుచుకోవడానికి మరియు జాబితాలో వివరాలను సరిచూసుకోవడానికి సిద్ధం కావాలని గ్రామ రెవిన్యూ అధికారి తాటిపాక అచ్యుతం కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అమలులో భాగంగా జూన్ 15వ తేదీ నుండి బూత్ లెవల్ అధికారులు ( బిఎల్ఓ ) ఇంటింటికీ వచ్చి వివరాలను సేకరిస్తారు. కావున గ్రామ ప్రజలందరూ ఒక కలర్ ఫోటో మరియు ఆధార్ కార్డు లేదా తత్సమాన గుర్తింపు కార్డును సిద్ధంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా కుటుంబ పెద్దల పాత వివరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, 2002 సంవత్సరంలో మీ తల్లిదండ్రులు, తాతయ్యలు లేదా నాయనమ్మలకు ఉన్న ఓటరు ఐడి (ఇ పి ఐ సి) నంబర్లను మరియు ఆ సమయంలో వారు నివసించిన ప్రాంతం వివరాలను ముందుగానే సేకరించి రాసి పెట్టుకోవాలని అధికారులు సూచించారు. సేకరించిన ఈ పూర్తి వివరాలను ఇంటికి వచ్చే బి.ఎల్. ఓ లకు అందజేయడం ద్వారా మీ ఓటు జాబితాలో సురక్షితంగా నమోదవుతుంది. ఈ ప్రక్రియలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం చాలా ముఖ్యం. నిరక్షరాస్యులకు, వృద్ధులకు మరియు ఈ కార్యక్రమం గురించి తెలియని వారికి గ్రామస్తులందరూ అవగాహన కల్పించి, అందరికీ సమాచారం చేరవేయాలని కోరుతున్నాము. ఓటర్లందరూ బి.ఎల్.ఓ లకు పూర్తి సహకారం అందించడం ద్వారా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా శంఖవరం గ్రామ రెవిన్యూ అధికారి తాటిపాక అచ్యుతం కోరారు. తమ ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని, కావున నిర్ణీత గడువులోగా ఈ వివరాలను సమర్పించి ఓటరు జాబితాలో మీ పేరును నిర్ధారించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పిల్లలకు తొలి వెయ్యి రోజులు అతి కీలకమైనవి నవచేతన శిక్షణా తరగతుల్లో ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి





**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 9**
పిల్లలు జన్మించిన దగ్గర నుండి వెయ్యి రోజులు ఎంతో కీలక మైనవని కాకినాడ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. నవసేతన శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం గండేపల్లి మండలం మల్లేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జగ్గంపేట సి డి పి ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన నవచేతన శిక్షణా తరగతులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ
ఈ శిక్షణలో 'నవచేతన' చరవాణి సాధనం ద్వారా పిల్లల ఎదుగుదలను శాస్త్రీయంగా అంచనా వేయడం, ఎదుగుదలలో జాప్యాలను తొలిదశలోనే గుర్తించే విధానాలపై అవగాహన కల్పిస్తున్నాము అన్నారు.
పిల్లల జీవితంలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమని, ఈ దశలో తగిన పోషణ, ఆరోగ్య సంరక్షణ, నేర్చుకునే అవకాశాలు కల్పిస్తే వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని చెప్పారు. 'నవచేతన' ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషకాహార లేమి, ఎదుగుదల జాప్యాలు, దివ్యాంగతలు అనే 4 రకాల సమస్యలను ముందుగానే గుర్తించి తగిన సేవలకు అనుసంధానం చేయవచ్చని వివరించారు
'నవచేతన' సాధనంతో పిల్లల పెద్ద కదలికలు, చిన్న కదలికలు, మాట నైపుణ్యం, తెలివి ఎదుగుదల, సామాజిక-భావోద్వేగ ఎదుగుదలను అంచనా వేయవచ్చని తెలిపారు. పరిశీలనలో గుర్తించిన పిల్లలను అవసరమైతే వైద్య సేవలకు, డిఐఈసి కేంద్రం కు పంపుతామని తెలిపారు. సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ, 'నవచేతన' అనేది కేవలం పరిశీలన సాధనం మాత్రమేనని, ఇది తుది నిర్ధారణ కాదని, తుది నిర్ధారణ వైద్య నిపుణులే చేస్తారని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలకమని అన్నారు.
ఈ కార్యక్రమంలో గండేపల్లి డాక్టర్ సురేంద్ర, ఎం ఎల్ హెచ్ పి లు, పర్యవేక్షకులు అమ్మాజీ, కరీమున్నిసా, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొనగా ఉదయం నుండి సాయంకాలం వరకు శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది

# గండేపల్లి లో గుర్తుతెలియని వ్యక్తి మృతి




**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 9:** మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గండేపల్లి మండల కేంద్ర మైన గండేపల్లి గ్రామంలో గ్రామ జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఎన్టీఆర్ విగ్రహం దిమ్మపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు, స్థానికులు పోలీసుల వివరాలు మెరకు నిన్న రాత్రి అక్కడ పడుకొని ఉన్న ఉన్నట్లుగా మంగళవారం మధ్యాహ్నం అయినప్పటికీ లెగకపోవడంతో అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు దీంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టార్టం నిమిత్తం తరలించామని తెలిపారు మృతుడు కీ తెల్ల రంగు సార్లు చొక్కా ఎరుపు రంగు నిక్కర్ తెల్ల వెంట్రుకలతో గుండు సుమారు 60 సంవత్సరాలు గలిగి ఉండవచ్చు వ్యక్తి ఆచూకీ తెలిసినవారు గండేపల్లి పోలీస్ స్టేషన్లో సంప్రదించ గలరని స్థానిక పోలీసులు కోరారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం దురదృష్టకరం-ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు




**మండపేట. పెన్ పవర్. జూన్09:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాద ఘటనపై రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్టీల్ మెల్టింగ్ షాప్‌లో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలుడు సంభవించడంతో పలువురు కార్మికులు మృతి చెందడం, మరికొందరు గాయపడడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ విషాద ఘటన గుండెను కలిచివేసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాద ఘటనపై ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలను వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గాయపడిన వారికి అన్ని విధాలా అండగా నిలిచి అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను నూతన యంత్రాలతో ఆధునికీకరించి, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.




## ప్రధాని మోదీ ఖాతాలో మరో చారిత్రాత్మక రికార్డు



- సుదీర్ఘ కాలం ప్రధానిగా కొనసాగిన ఘనత
- శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకుడు కోన సత్యనారాయణ

**మండపేట. పెన్ పవర్. జూన్ 9:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరనుందని బీజేపీ సీనియర్ నాయకుడు కోన సత్యనారాయణ తెలిపారు. జూన్ 10, 2026 నాటికి మోదీ వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా కొనసాగి, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సుదీర్ఘకాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానిగా రికార్డు సృష్టించనున్నారని పేర్కొన్నారు. మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించి, వరుసగా మూడు పర్యాయాలు దేశానికి నాయకత్వం వహిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటి వరకు ఈ రికార్డు భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరిట ఉండగా, జూన్ 10తో మోదీ ఆ రికార్డును అధిగమించ నున్నారని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా కలిపి ఎన్నికైన ప్రభుత్వాధినేతగా అత్యంత కాలం సేవలందించిన నాయకుడిగా కూడా మోదీ ఇప్పటికే రికార్డు నెలకొల్పారని కోన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీకి ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.


## చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా అంగన్వాడి కేంద్రాలు.

-అంగన్‌వాడీ టీచర్లకు నవచేతన శిక్షణా కార్యక్రమంలో సిడిపిఓ,పూర్ణిమ




**కిర్లంపూడి, పెన్ పవర్,జూన్ 09:** అంగన్వాడీ కేంద్రాలను చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జగ్గంపేట ఐసిడిఎస్,సిడిపిఓ,ఎం పూర్ణిమ అన్నారు. ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రారంభించిన నవచేతన' శిక్షణా కార్యక్రమంలో భాగంగా, పుట్టినప్పటి నుంచి ఆరేళ్ల లోపు పిల్లల ఎదుగుదలను కృత్రిమ మేధతో పరిశీలించే పద్ధతులపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా కార్యక్రమం మండల కేంద్రమైన కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.
ఈ సందర్భంగా సీడీపీఓ, ఎం పూర్ణిమ మాట్లాడుతూ ఈ శిక్షణలో 'నవచేతన' చరవాణి సాధనం ద్వారా పిల్లల ఎదుగుదలను శాస్త్రీయంగా అంచనా వేయడం, ఎదుగుదలలో జాప్యాలను తొలిదశలోనే గుర్తించే విధానాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.పిల్లల జీవితంలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమన్నారు.ఈ దశలో తగిన పోషణ, ఆరోగ్య సంరక్షణ, నేర్చుకునే అవకాశాలు కల్పిస్తే వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని తెలియజేశారు. నవచేతన' ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషకాహార లేమి, ఎదుగుదల జాప్యాలు, దివ్యాంగతలు అనే 4 రకాల సమస్యలను ముందుగానే గుర్తించి తగిన సేవలకు అనుసంధానం చేయవచ్చని వివరించారు.
నవచేతన' సాధనంతో పిల్లల పెద్ద కదలికలు,చిన్న కదలికలు,మాట నైపుణ్యం, తెలివి ఎదుగుదల, సామాజిక-భావోద్వేగ ఎదుగుదలను అంచనా వేయవచ్చని తెలిపారు. పరిశీలనలో గుర్తించిన పిల్లలను అవసరమైతే వైద్య సేవలకు,డిఇఐసి కేంద్రానికి పంపుతామని తెలియజేశారు.
నవచేతన' అనేది కేవలం పరిశీలన సాధనం మాత్రమేనని, ఇది తుది నిర్ధారణ కాదని, తుది నిర్ధారణ వైద్య నిపుణులే చేస్తారని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలకమన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి హేమాంజలి, ఎంఈఓ లు,టి జోసెఫ్, మక్కా చిన్నారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, పి రమణికుమారి,పర్యవేక్షకులు సునీత,బూసమ్మ, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 9:** నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుండ నున్నట్లు జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డి వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 06 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు 33ెజ ప్రత్తిపాడు, వేలంక, వీరవరం సబ్ స్టేషన్ కు వెళ్ళు సప్లై లైన్ మైంటెనెన్సు చేయడంతోపాటు చెట్లు కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టడం వల్ల సప్లై నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.వీటితోపాటు కిర్లంపూడి టౌన్ కూడా ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సప్లై నిలుపుదల చేయబడుతుందన్నారు. కావున వినుయోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## జంగారెడ్డిగూడెం భక్తుల రజతోత్సవ పాదయాత్రకు అన్నవరంలో ఘన స్వాగతం

25వ సారి కాలినడకన అన్నవరం చేరుకున్న 300 మంది భక్తులు





**అన్నవరం పెన్ పవర్ జూన్ 9:** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం నుండి శ్రీ రామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రజతోత్సవ (25వ) పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. సుమారు 300 మంది భక్తులు ఐదు రోజుల పాటు అచంచల భక్తిశ్రద్ధలతో కాలినడకన ప్రయాణించి, అన్నవరం రత్నగిరి చేరుకుని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.
?ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, జంగారెడ్డిగూడెం నుండి అన్నవరం వరకు కాలినడకన రావడం తమకు ఇది వరుసగా 25వ సారి అని తెలిపారు. పాతికేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం స్వామివారి అనుగ్రహంతో విజయవంతంగా సాగుతోందని పేర్కొన్నారు.
?దేవస్థానం ప్రత్యేక చొరవ -- ఏర్పాట్ల వివరాలు:
?భక్తుల రాకను తెలుసుకున్న అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) నల్లం సూర్య చక్రధరరావు ప్రత్యేక చొరవ తీసుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.
?ప్రత్యేక దర్శనం: సుదూరం నుంచి కాలినడకన వచ్చిన భక్తులందరికీ ప్రత్యేక దర్శనం కల్పించి, శ్రీ స్వామివారి దివ్య ఆశీస్సులు పొందేలా చర్యలు చేపట్టారు.
? దేవస్థానం తరపున భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడంతో పాటు, రత్నగిరి కొండపైనే ప్రత్యేక వసతి సదుపాయాలు ఏర్పాటు చేసి విశ్రాంతికి అనుకూలమైన ఏర్పాట్లు చేశారు. ?"పాతికేళ్లుగా భక్తి మార్గంలో నడుస్తూ రజతోత్సవ పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసిన జంగారెడ్డిగూడెం శ్రీ రామ సేవా సమితి సభ్యులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాము. వారి అచంచలమైన భక్తి, నిబద్ధత ఇతర భక్తులకు ఎంతో స్ఫూర్తిదాయకం."
--- శ్రీ నల్లం సూర్య చక్రధరరావు, కార్యనిర్వహణాధికారి (ఈవో)
?దేవస్థానం అందించిన ఆత్మీయ స్వాగతం, ప్రత్యేక దర్శనం, అన్నప్రసాదం మరియు వసతి సదుపాయాల పట్ల జంగారెడ్డిగూడెం భక్తులు పూర్తి హర్షం వ్యక్తం చేస్తూ, దేవస్థానం అధికారులకు మరియు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 9**: మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అభయాంజనేయ ఓల్డ్ ఐరన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ప్రారంభించారు. ప్రతి మంగళవారం ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు కమిటీ సభ్యులతో పాటు, ప్రజలందరిపైనా మెండుగా ఉండాలని స్వామి వారిని కోరారు. ముందుగా ఆలయ అర్చకులు పొన్నా సుబ్రహ్మణ్య శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు నైదాన బాబ్జి,ఆలయ కమిటీ సభ్యులు ఆరుగుల అర్జున,వేగి శ్రీను, సత్తిబాబు, రమణ, అబ్బు పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బి.ఎల్.ఓ లు అందరు 90% ఆన్లైన్ మ్యాపింగ్ కంప్లీట్ చేయాలి....

ప్రత్తిపాడు ఎన్నికల నమోదు అధికారి ఎ.శ్రీనివాసరావు,






**శంఖవరం పెన్ పవర్ జూన్ 09:-** కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు బి.ఎల్.ఓ లు అందరు 90% ఆన్లైన్ మ్యాపింగ్ కంప్లీట్ చేయాలని అని ఇ ఆర్ ఓ లకు చెప్పడం జరిగింది.
కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంకవరం తాసిల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ ఇ ఆర్ ఓ శంఖవరం మండలం ఎలక్షన్
బి ఎల్ ఓ లకు అందరు కి కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. మరియు ఎలక్షన్ కిట్లు కూడా బి ఎల్ ఓ లకు అందరకి అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లు తో ఎలక్షన్ సూపర్వైజర్లు కూడా ట్రైనింగ్ కి హాజరు అవ్వడం జరిగింది.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు భారీఎత్తున ఆర్థిక సాయం అందించాలి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 9:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం భారీఎత్తున ఆర్థిక సహాయం అందించాలని పీసీసీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించడమే కాకుండా, చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈరుగుల చక్రం,గాలి వెంకటరమణ,యస్. కోటేశ్వరరావు,సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్ర టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ వేలం.- రూ. 79 వేల రికార్డు ధరకు అమ్ముడైన పిఠాపురం క్రీడాకారుడు




**కాకినాడ బ్యూరో (గొల్లప్రోలు) జూన్, 9** ఆంధ్ర టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ (ఏటిపిఎల్) ఆటగాళ్ల వేలంలో పిఠాపురానికి చెందిన ప్రముఖ ఆల్‌రౌండర్ వీరు పాలూరి సరికొత్త రికార్డు సృష్టించారు. విశాఖపట్నంలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో నిర్వహించిన ఈ లీగ్ వేలం ప్రక్రియలో వీరు పాలూరి అత్యధిక ధరకు అమ్ముడై అందరి దృష్టిని ఆకర్షించారు.
?వేలం ప్రక్రియలో వీరు పాలూరిని దక్కించుకోవడానికి వివిధ ఫ్రాంచైజీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అంతిమంగా కడప కింగ్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం రూ. 79,000 భారీ మొత్తాన్ని చెల్లించి ఆయనను తమ జట్టులోకి సొంతం చేసుకుంది. స్థానిక టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలలో వీరు పాలూరికి ఉన్న అద్భుతమైన ట్రాక్ రికార్డు,బ్యాటింగ్ మరియు బౌలింగ్ విభాగాల్లో ఆయన ప్రదర్శిస్తున్న ఆల్‌రౌండ్ నైపుణ్యాలే ఈ భారీ ధరకు ప్రధాన కారణమని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. రాష్ట్రస్థాయి లీగ్‌లో వీరు పాలూరి అత్యంత కీలకమైన ఆటగాడిగా నిలుస్తాడని కడప కింగ్స్ ఫ్రాంచైజీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ లీగ్‌కు ఎంపికవ్వడమే కాకుండా, రికార్డు స్థాయిలో వేలం పలకడం ద్వారా వీరు పాలూరి పిఠాపురం నియోజకవర్గ క్రీడా ఖ్యాతిని రాష్ట్రస్థాయికి తీసుకెళ్లారు.
?ఈ విజయంపై స్థానిక క్రీడాకారులు,టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. వీరు పాలూరికి పలువురు ప్రముఖులు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ లీగ్‌లో ఆయన మరిన్ని విజయాలు సాధించి, పిఠాపురం పేరును మరింత ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు.

### అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల బండిలా ముందుకు సాగుతుంది...

## కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు



**గండేపల్లి, పెన్ పవర్, జూన్9:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కేంద్ర సహకారం అందుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వేగంగా నడిపిస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు మీడియాకు తెలిపారు.
రాజధాని అమరావతి నిర్మాణం నుంచి రోడ్లు, నీటిపారుదల ప్రాజెక్టుల వరకు ప్రతి రంగంలో పనులు వేగం పుంజుకున్నాయి. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలతో సంక్షేమం అందుతోంది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు, విద్య, వైద్యం, ఉపాధి కోసం మెగా డీఎస్సీ నిర్వహణతో యువతకు భరోసా ఇస్తున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తోంది. జగ్గంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు విస్తృతంగా వేస్తున్నారు. మామిడాడ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 5 కోట్లు, తాళ్లూరు లిఫ్ట్‌కు 52 కోట్లు, మల్లవరం ప్రాజెక్టుకు 132 కోట్లు మంజూరు చేశారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని పోతుల మోహనరావు పేర్కొన్నారు.
కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## ఇటుక బట్టీల యజమానులు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

- ఆలమూరు బట్టీ యూనియన్ సభ్యుల చొరవ ప్రశంసనీయం
- మైనింగ్ ఏడి అశోక్



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 09;**ఇటుక బట్టీల కోసం మట్టిని నిల్వ ఉంచడానికి ప్రభుత్వానికి పన్నుల రూపేణ ఏడాదికి రూ.10 వేలు చెల్లించాలని మైనింగ్ ఏడి అశోక్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ మైనింగ్ శాఖ మార్గదర్శకాలను ఇటుక బట్టీల యజమానులు తప్పనిసరిగా పాటించాలన్నారు.ఇటుక బట్టీలకు వినియోగించే మట్టి నిమిత్తం గవర్నమెంట్ వారు బట్టీకి సంవత్సరానికి మట్టికి రూ.10 వేలు చెల్లించాలని జీవో ఇవ్వడం జరిగిందన్నారు. ఆలమూరు బట్టీ యూనియన్ వారు 55 బట్టీలకు బట్టీకి రూ.10వేల చొప్పున, చొప్పెల్ల యూనియన్ తరపున 20 బట్టీల వారు బట్టీకి రూ.10వేల చొప్పున మంగళవారం రాయల్టీ ఫీజును చెల్లించారు. మైనింగ్ ఏడి అశోక్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన బట్టీల యజమానులు కూడా జూన్ 15లోగా రూ.10 వేలు చెల్లించి రశీదును వారు నిర్వహించే బట్టీల దగ్గర ఉంచుకోవాలని సూచించారు.రశీదు లేని ఇటుక బట్టీల వద్ద గుట్టలు పరిశీలించి జరిమానా విధించడం జరుగుతుందని అశోక్ తెలిపారు. కార్యక్రమంలో ఆలమూరు ఇటుక బట్టీ యూనియన్ నాయకులు సలాది నాగేశ్వరరావు, వంటిపల్లి సతీష్, చీపురుపల్లి గణేష్, తమలంపూడి కృష్ణారెడ్డి, జగన్నాథ రెడ్డి, నెక్కంటి ప్రసాద్,సూరపరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్వో హుస్సేన్ మృతికి న్యాయం చేయాలి

**కాకినాడ కలెక్టరేట్ ఎదుట వీఆర్వోల నిరసన**




**కాకినాడ, పెన్ పవర్,జూన్ 9**: కర్నూలు జిల్లా వెంకాయపల్లి వీఆర్వో మహ్మద్ హుస్సేన్ మృతికి కారణమైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని,బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వీఆర్వోలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.వీఆర్వోల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో వీఆర్వోలు పాల్గొని తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఆర్వో సంఘం జాయింట్ సెక్రటరీ అనిశెట్టి రామకృష్ణ, సంఘ నాయకులు మల్లేష్, కిషోర్ మాట్లాడుతూ వీఆర్వో మహ్మద్ హుస్సేన్ అనారోగ్యంతో బాధపడుతూ సెలవు మంజూరు చేయాలని అధికారులను కోరినా, ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకుండా విధుల విషయంలో ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపించారు.
అధికారుల వేధింపులు,అధిక పనిభారం, సమయపాలన పేరుతో పెరుగుతున్న ఒత్తిడులు వీఆర్వోలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల వల్ల ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బతింటోందని, కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.హుస్సేన్ మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని,అలాగే ఆయన కుటుంబానికి తగిన ఆర్థిక సాయం, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.వీఆర్వోల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రాష్ట్ర స్థాయి నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నాయకులు ప్రకటించారు. హుస్సేన్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## మంత్రి నారా లోకేష్ ను కలసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట. పెన్ పవర్.జూన్ 9 :**రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఉండవిల్లిలో మంగళవారం మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, ఆర్.టి.జి శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గత నెలలో జరిగిన వర్చువల్ మహానాడు విజయవంతగా జరిగిందని, ఈ మహానాడు పండుగను ఒక మహా యజ్ఞంలా భావించి పార్టీ సిద్దాంతాలను ప్రజలలోకి బలంగా తీసుకువెళ్ళేందుకు టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎంతో కృషి చేశారని, టీడీపీ క్రమశిక్షణ, సత్తా చాటేందుకు ఇది ఒక అద్భుతమైన వేదికలా మారిందని ఎమ్మెల్యే లోకేష్ తో అన్నారు. ఈ వర్చువల్ విధానాన్నే కొనసాగిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మండపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను ఎమ్మెల్యే వేగుళ్ళ లోకేష్ కు వివరించినట్టు తెలిపారు.

## చోరీకి గురైన సెల్‌ఫోన్లు రికవరీ చేసిన పోలీసులు.




**పోలీసులకు బాధితుల కృతజ్ఞతలు.**

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 09;**వివిధ సందర్భాల్లో చోరీకి గురై పోయిన సెల్‌ఫోన్లను ఆలమూరు పోలీసులు రికవరీ చేసి యజమానులకు అప్పగించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వివిధ ప్రాంతాల్లో మిస్ అయిన ఆరు సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. పోయిందనుకున్న ఫోన్లు తిరిగి దొరకడంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలమూరు ఎస్సై నరేష్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ మిస్ అయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిమ్‌కార్డు బ్లాక్ చేయించుకోవడం ద్వారా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అలాగే బ్యాంక్ ఖాతాలకు లింక్ అయిన మొబైల్ నంబర్లను వెంటనే మార్చుకోవాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల ఆస్తులను రక్షించడంలో పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పనిచేస్తున్నారని, సెల్‌ఫోన్ పోయిన సందర్భాల్లో ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేస్తే త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎస్సై వెల్లడించారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి





**వాసంశెట్టి సత్యం**

**రామచంద్రపురం, పెన్ పవర్,జూన్ 9**: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు.
ద్రాక్షారామం మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదు కావడం, అనర్హుల పేర్లను తొలగించడం వంటి ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించబడేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి బాధ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ఓటర్లందరూ తమ వివరాలను ధృవీకరించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునేలా సహకరించాలని కోరారు.ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రతి ఓటు విలువను కాపాడే బాధ్యత అందరిపైనా ఉందని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, పెంకే సాంబశివరావు, టేకుమూడి సత్యనారాయణ, వయిట్ల గజలక్ష్మి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పలివెల ప్రకాష్, చిల్లా గోపాలకృష్ణ, ఆకుల నారాయణరావు, బొమ్ము బాలకృష్ణతో పాటు యూనిట్ కమిటీలు, బూత్ కమిటీలు, గ్రామ కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని వారు సంకల్పించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజల పాలిట సంజీవని. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

-క్యాంపు కార్యాలయంలో రూ.25.7 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 9** :ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పేద ప్రజల పాలిట సంజీవని వంటిదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలు కుటుంబాలకు రూ.27.2 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రాణాధారంగా నిలుస్తోందన్నారు.వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలియజేశారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్,ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి,గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్,ఏలేశ్వరం మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,కూటమి నాయకులు వీర్ల సూరిబాబు,గొంతిన సురేష్,అలమండ చలమయ్య,బొదిరెడ్డి గోపి,బస్సా మహాలక్ష్మి ప్రసాద్, పలువురు కూటమి నాయకులు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పాఠశాలల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి





- వంద శాతం అడ్మిషన్లే లక్ష్యం
- డొక్కా సీతమ్మ పథకాన్ని నాణ్యతతో అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 9:** జూన్ 12 నుంచి జిల్లాలోని పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో వంద శాతం అడ్మిషన్లే లక్ష్యంగా పనిచేసి బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన పాఠశాల విద్యాశాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ విద్యాశాఖ, మోడల్ స్కూల్స్, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ కళాశాలల అడ్మిషన్లు, బడి బయట ఉన్న పిల్లలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, వివిధ నిర్మాణ పనుల పురోగతిపై జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలు,విద్యాశాఖ ఉన్నతాధికారు లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా బడి బయట ఉన్న చిన్నారులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజు నుంచే 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం'ను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత మెనూ ప్రకారం అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా పర్యవేక్షణ మరింత పటిష్టం చేయాలని చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, విద్యా నాణ్యత పెంపుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, డిజిటల్ ల్యాబ్‌లు తదితర పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి. రమేష్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వీవీవీ సత్యనారాయణ, ఇంటర్మీడియట్ డీఐఈవో కేశవరావు, ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ వెంకటరాజు, జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాకినాడలో పెట్టుబడులకు అపార అవకాశాలు

పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి: జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 9:** కాకినాడ జిల్లాలో కీలక రంగాల్లో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు,పెట్టుబడిదారులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు, భూమి లభ్యతతో పాటు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందుతుందని ఆయన హామీ ఇచ్చారు. మంగళవారం కాకినాడలోని జీఆర్డీ హోటల్‌లో భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) విశాఖపట్నం విభాగం, వివిధ ప్రభుత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పారిశ్రామిక సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి, కొత్త పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమలు –ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంపే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు సుదీర్ఘ తీరప్రాంతం, మూడు ప్రధాన ఓడరేవులు, బలమైన రవాణా వ్యవస్థ, 22 పారిశ్రామిక పార్కులు ఉండటంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కాకినాడ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రత్యేక ఆర్థిక మండలులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమల స్థాపనకు అనువైన భూమి అందుబాటులో ఉండటంతో పెట్టుబడులకు జిల్లా అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న "చైనా ప్లస్ వన్" వ్యూహాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశ్రామికవేత్తలు కాకినాడ జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని సూచించారు. పరిశ్రమల స్థాపన, సులభతర వాణిజ్య నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం వేగవంతమైన, పారదర్శక సేవలు అందిస్తోందని తెలిపారు. పెట్టుబడిదారుల సదస్సుల్లో కుదిరిన ఒప్పందాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన మంజూరు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. సముద్ర ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్, రసాయన పరిశ్రమల రంగాల్లో పెట్టుబడులకు జిల్లాలో విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు.
వ్యవసాయ, సముద్ర ఆధారిత ఉప ఉత్పత్తుల విలువవృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన ఆయన, వరి పొట్టు, తవుడు, జీడిపప్పు వ్యర్థాలు, రొయ్యల పొట్టు వంటి వ్యర్థ పదార్థాల నుంచి విలువైన ఎగుమతి ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, తక్కువ శ్రమ వ్యయాలు వస్త్ర పరిశ్రమల అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని, రాబోయే భారీ ఉక్కు పరిశ్రమల అనుబంధ రంగాల్లో కూడా అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సదస్సులో సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్, శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. సాంబశివరావు, సీఐఐ విశాఖపట్నం ప్రతినిధులు, వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, ఏపీఐఐసీ అధికారులు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి సుబ్బారావు,కాకినాడ, కోనసీమ జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు,స్థానిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## 25వ సారి కాలినడకన అన్నవరం చేరుకున్న 300 మంది భక్తులు





**కాకినాడ బ్యూరో (అన్నవరం) జూన్, 9:**పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం నుండి శ్రీ రామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ సత్యనారాయణ స్వామివారి పాదయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసింది. సుమారు 300 మంది భక్తులతో కూడిన ఈ బృందం, ఐదు రోజుల పాటు నిరంతరాయంగా కాలినడకన ప్రయాణించి, ఐదవ రోజున రత్నగిరి (అన్నవరం కొండ) పైకి చేరుకున్నారు.
రజతోత్సవ మైలురాయి (25వ సారి):
ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, జంగారెడ్డిగూడెం నుండి అన్నవరం కొండకు కాలినడకన రావడం తమకు ఇది 25వ సారి అని అత్యంత సంతోషంతో వెల్లడించారు. పాతికేళ్లుగా (సిల్వర్ జూబ్లీ) ఈ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని ఏటా దిగ్విజయంగా కొనసాగిస్తూ, స్వామివారి కృపకు పాత్రులవుతున్నామని వారు తెలిపారు.
ఈవో ప్రత్యేక చొరవ -- ఘన స్వాగతం:
సుదీర్ఘమైన పాదయాత్రతో కొండపైకి చేరుకున్న 300 మంది భక్తులకు అన్నవరం దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. భక్తుల రాకను తెలుసుకున్న దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) నల్లం సూర్య చక్రరావు ప్రత్యేకంగా స్పందించారు.
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో గారు స్వయంగా పర్యవేక్షించి, ఈ క్రింది ఏర్పాట్లు చేశారు:
ప్రత్యేక దర్శనం: క్యూ లైన్లలో ఇబ్బంది పడకుండా భక్తులందరికీ శ్రీ సత్యనారాయణ స్వామివారి దివ్య దర్శనం చేయించారు.
అన్నప్రసాద వితరణ: సుదూరం నుండి నడిచి వచ్చిన భక్తులందరికీ దేవస్థానం తరపున భోజన వసతి కల్పించారు.
భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు కొండపైనే ప్రత్యేక వసతి ఏర్పాటు చేశారు.
పాతికేళ్లుగా భక్తి మార్గంలో నడుస్తూ, ఈ రజతోత్సవ పాదయాత్రను విజయవంతం పూర్తిచేసిన జంగారెడ్డిగూడెం శ్రీ రామ సేవా సమితి సభ్యులను ఈవో నల్లం సూర్య చక్రరావు అభినందించారు.

## జూన్ 10న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

**కాకినాడ, పెన్ జూన్ 9:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ (జడ్పీ) స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 10వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వీవీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సమావేశాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అదేవిధంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అన్నమయ్య జిల్లాలకు చెందిన సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశాలకు హాజరై ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై వివరాలు సమర్పించాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, వివిధ శాఖల పనితీరు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశాల్లో సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు, సభ్యులు సమయానికి హాజరై సమావేశాలను విజయవంతం చేయాలని సీఈఓ లక్ష్మణరావు కోరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నలుగురు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరణ




**ఆలమూరు,పెన్ పవర్, జూన్ 09;**మండలంలోని ఇటీవల పదోన్నతి పొందిన పంచాయతీ కార్యదర్శులు నలుగురు సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. పెనికేరు పంచాయతీ గ్రేడు-3 కార్యదర్శిగా టి.వెంకటకృష్ణ, బడుగువానిలంక గ్రేడు-3 కార్యదర్శిగా కె.రాకేష్ కూమార్, గ్రేడు-4 కార్యదర్శులుగా గుమ్మిలేరు కార్యదర్శిగా జె.మణిస్వాతి, పినపళ్ల కార్యదర్శిగా ఎన్. మణీషా నాగసాయి బాధ్యతలు స్వీకరించారు. వీరందరూ ఎంపీడీవో ఏ. రాజు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.
కార్యదర్శుల బదిలీ
ఆలమూరు మండలంలో పనిచేస్తున్న 11 మంది పంచాయతీ కార్యదర్శులు పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. బడుగువానిలంక కార్యదర్శి సీహెచ్ వీరవెంకటరెడ్డి, పెనికేరు కార్యదర్శి జె.అయ్యన్న, చింతలూరు కార్యదర్శి ఎం.వీరన్నచౌదరి, నర్సిపూడి కార్యదర్శి కె.దేవిశ్రీసబరి, పినపళ్ల కార్యదర్శి కె.పోలారాజు, కలవచర్ల కార్యదర్శి కెడివి పద్మావతి, మడికి-3 కార్యదర్శి ఎస్ కె సమీరవలి, సూర్యారావుపేట కార్యదర్శి జి.విజయకుమార్, చెముడులంక-2 కార్యదర్శి జె.విశ్వనాథరావు, జొన్నా డ-2 కె.స్వాతి పదోన్నతి పొంది బదిలీ అయ్యారని ఎంపీడీవో ఏ.రాజు, డిప్యూటీ ఎంపీడీవో వీర్రాజు తెలిపారు.

## కాకినాడలో కారు అగ్నిప్రమాదం

తృటిలో తప్పిన ప్రమాదం





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 9:** కాకినాడ నగరంలోని భానుగుడి సెంటర్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఓ కారు అగ్నికి ఆహుతైన ఘటన కలకలం రేపింది. పద్మప్రియ థియేటర్ సమీపంలో నిలిచి ఉన్న రెనాల్ట్ ట్రైబర్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. టూ టౌన్ సీఐ అప్పలనాయుడు,పోలీసు సిబ్బంది గిరి, ప్రసాద్ తదితరులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా? లేక మరేదైనా సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే కారు పూర్తిగా దగ్ధమైనట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పింక్ వైబ్స్‌లో నభా నటేష్... ఫ్యాన్స్‌ను ఫిదా చేసిన లక్కీ లుక్!



టాలీవుడ్ 'ఇస్మార్ట్ బ్యూటీ' నభా నటేష్ తన సరికొత్త ఫోటోషూట్‌తో ఇంటర్నెట్‌లో సెన్సేషన్ సృష్టిస్తోంది. సాంప్రదాయ దుస్తుల్లో ఆమె దేవకన్యలా మెరిసిపోతున్న స్టూడియో పోర్ట్రెయిట్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. కేవలం మోడ్రన్ దుస్తుల్లోనే కాదు, ట్రెడిషనల్ లుక్‌లోనూ తనను కొట్టేవారే లేరని ఈ కన్నడ కస్తూరి నిరూపించింది. "ఏష్రవ ంశీట్అవంం శీట ంఱఎజూశ్రీఎ ఎవఱఅస్త్ర" అంటూ నభా పెట్టిన క్యాప్షన్, ఆమె క్యూట్ స్మైల్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం.

**దేవకన్యలా మెరిసిన ఇస్మార్ట్ పాప:**
ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో నభా నటేష్ వేసుకున్న కాస్ట్యూమ్ చాలా రిచ్‌గా, క్లాసిక్‌గా ఉంది. ప్యాస్టెల్ డస్టీ-రోజ్ కలర్ జార్జెట్ చీరపై చేసిన జర్దోజీ ఎంబ్రాయిడరీ, చిన్న చిన్న క్రిస్టల్ డిజైన్స్ ఆమెకు రాయల్ లుక్ తెచ్చిపెట్టాయి. ఇక దీనికి మ్యాచింగ్‌గా బంగారు తీగలతో హెవీగా వర్క్ చేసిన షీర్ బ్లౌజ్, దానికి ఉన్న టాసెల్ స్లీవ్స్ డ్రెసింగ్ స్టైల్‌ను మరింత నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.

**ముత్యాల హారం.. తలలో గులాబీలు:**
ఈ ట్రెడిషనల్ లుక్‌కు తగ్గట్టుగా నభా జ్యువెలరీ సెలక్షన్ కూడా అద్భుతంగా ఉంది. మెడలో కుందన్ పెండెంట్ ఉన్న ముత్యాల చోకర్ నెక్లెస్, చేతులకు సాంప్రదాయ బంగారు గాజులు ధరించింది. వీటన్నింటికీ మించి, తన జుట్టును వెనక్కి చక్కగా లో-బన్‌లా ముడివేసి, దానికి అలంకరించిన తాజా పింక్ గులాబీ పువ్వులు ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. లైట్ మేకప్, న్యూడ్-పింక్ లిప్‌స్టిక్‌తో నభా వెలిగిపోయింది.

**2026లో రెండు భారీ పాన్ ఇండియా సినిమాలు:**
'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో రామ్ పోతినేని సరసన నటించి టాలీవుడ్‌లో తిరుగులేని క్రేజ్ తెచ్చుకున్న నభా నటేష్, ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉంది. ఆమె నటిస్తున్న రెండు భారీ సినిమాలు నాగబంధం, స్వయంభూ ఈ ఏడాది రిలీజ్ కు సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ రెండు సినిమాలు ఆమె కెరీర్‌ను మరో మలుపు తిప్పడం ఖాయంగా కనిపిస్తోంది.గ్లామర్ షోతో కుర్రాళ్ల గుండెల్లో మంటలు పెట్టే నభా నటేష్, ఇలా పద్ధతైన పట్టుచీర లాంటి సాంప్రదాయ లుక్‌లో కనిపించేసరికి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. ఇన్స్టాగ్రామ్‌లో ఈ ఫోటోలు పెట్టిన కొద్దిసేపట్లోనే లక్షల్లో లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది. అటు నటనలో, ఇటు ఫ్యాషన్‌లో ఎప్పటికప్పుడు తన వైవిధ్యాన్ని చూపిస్తున్న ఈ ఇస్మార్ట్ బ్యూటీ రాబోయే పాన్ ఇండియా సినిమాలతో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.



ఆధునిక పవర్ డ్రెస్సింగ్ లుక్‌తో చిక్ ఇండోర్ పోర్ట్రెయిట్‌లో రుక్సార్ ధిల్లాన్ స్టన్స్

## ఆఫ్ఘన్‌తో వన్డే సిరీస్.. భారత్ తుది జట్టు ఇదేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్‌తో ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన ఏకైక టెస్టులో ఇన్నింగ్స్, 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టీమిండియా సిరీస్‌ను గ్రాండ్‌గా ఆరంభించింది. ఈ టెస్టు ద్వారా భారత జట్టుకు కావాల్సినంత ప్రాక్టీస్ లభించింది. ముఖ్యంగా లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ లాంటి యువ ఆటగాడు తనను తాను నిరూపించుకోవడానికి ఇదొక చక్కని వేదికగా నిలిచింది. టెస్టు మ్యాచ్ ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి జూన్ 13, 17, 20 తేదీల్లో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌పై పడింది.

**కోహ్లి ఔట్.. రోహిత్, హార్దిక్ ఇన్:**
గాయం కారణంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఈ వన్డే సిరీస్‌కు దూరం కావడంతో, అతడి స్థానంలో యశస్వి జైస్వాల్‌ను సెలక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. మరోవైపు, చాలా రోజుల తర్వాత ఇషాన్ కిషన్ సైతం వన్డే జట్టులో స్థానం దక్కించుకున్నాడు. ఇక గాయాల నుంచి కోలుకున్న ఓపెనర్ రోహిత్ శర్మ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులో చేరారు. దీంతో తొలి వన్డేలో భారత తుది జట్టు కూర్పుపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతుంది.

ఇషాన్ కిషన్ ఫుల్ ఫామ్‌లో ఉన్నా.. జైస్వాల్‌కే నా ఓటు!
టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడుతూ.. తొలి వన్డే కోసం తన అంచనా జట్టును ప్రకటించారు. ఐపీఎల్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున 602 రన్స్ చేయడంతో పాటు కెప్టెన్‌గానూ దుమ్ములేపిన ఇషాన్ కిషన్‌ను పక్కన పెట్టడం గమనార్హం. టీ20 వరల్డ్ కప్ 2026లోనూ రాణించిన ఇషాన్ కంటే.. యశస్వి జైస్వాల్‌కే తుది జట్టులో పెద్దపీట వేయాలని అభిషేక్త నాయర్ సూచించారు.

**బ్యాటింగ్ లిస్ట్ ఇదే:**
తొలి వన్డేలో కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌తో కలిసి రోహిత్ శర్మ ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. విరాట్ కోహ్లి లేని వన్‌డౌన్ (నెం.3) స్థానంలో యశస్వి జైస్వాల్‌కి అవకాశం ఇవ్వాలి.. మూడో స్థానంలోనూ జైస్వాల్ బాగా రాణిస్తాడు.. శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో, కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో ఆడనుండగా, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, హర్ష్ దూబే వరుసగా 6, 7, 8 స్థానాల్లో బ్యాటింగ్‌కు చేయాలని అభిషేక్ నాయర్ వెల్లడించారు. ఇక తన జట్టులో అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు గుర్నూర్ బ్రార్కు చోటివ్వగా, స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ను తీసుకున్నాడు.

**ఐపీఎల్ ప్రదర్శనల లెక్కలు ఇవే:**
ఇషాన్ కిషన్ (SRH): ఐపీఎల్ 2026లో 602 పరుగులతో వీరవిహారం చేశాడు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు.
యశస్వి జైస్వాల్ (RR): రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా 16 మ్యాచ్‌లలో 427 రన్స్ సాధించాడు.
ప్రస్తుత ఫామ్ దృష్ట్యా ఇషాన్‌ను ఆడించే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, అభిషేక్ నాయర్ మాత్రం జైస్వాల్ వైపే మొగ్గు చూపడం విశేషం.

**తుది జట్టు అంచనా:**
1 రోహిత్ శర్మ ఓపెనర్
2 శుబ్‌మన్ గిల్ ఓపెనర్ & కెప్టెన్
3 యశస్వి జైస్వాల్ -టాప్ ఆర్డర్ బ్యాటర్
4 శ్రేయస్ అయ్యర్ -మిడిల్ ఆర్డర్ బ్యాటర్
5 కేఎల్ రాహుల్ -వికెట్ కీపర్ బ్యాటర్
6 హార్దిక్ పాండ్యా -ఆల్‌రౌండర్
7 వాషింగ్టన్ సుందర్ -ఆల్‌రౌండర్
8 హర్ష్ దూబే -ఆల్‌రౌండర్
9 కుల్దీప్ యాదవ్ -స్పెషలిస్ట్ స్పిన్నర్
10 అర్ష్‌దీప్ సింగ్ -పేసర్
11 గుర్నూర్ బ్రార్ -పేసర్

# క్రికెట్ ఆడిన ఇంగ్లాండ్ ఫుట్‌బాల్ టీమ్.. నెట్టింట వీడియోలు వైరల్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా వరల్డ్ కప్ 2026 మెగా టోర్నమెంట్‌కు సమయం దగ్గరపడుతుండటంతో అన్ని జట్లు సన్నాహకాల్లో మునిగిపోయాయి. అయితే, మైదానంలో ఎప్పుడూ అత్యంత సీరియస్‌గా ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేసే ఇంగ్లాండ్ (జుఅస్త్రశ్రీఖఅస) జట్టు.. ఈసారి రూట్ మార్చింది. తమ ట్రైనింగ్ సెషన్‌లో కాసేపు ఫుట్‌బాల్‌ను పక్కన పెట్టి, చేతికి క్రికెట్ బ్యాట్ పట్టి సందడి చేసింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన విజువల్స్ నెట్టింట తెగ హల్‌చల్ చేస్తున్నాయి.



**ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో క్రికెట్:**
ఇంగ్లాండ్ క్రీడా సంస్కృతిలో క్రికెట్‌కు చాలా ప్రత్యేకమైన స్థానం ఉంది. వరల్డ్ కప్ క్యాంప్‌లో ఆటగాళ్ల ఒత్తిడిని తగ్గించడానికి కోచింగ్ స్టాఫ్ ఈ వినూత్న ప్లాన్ వేశారు. ఫుట్‌బాల్ స్టార్స్ అందరూ బ్యాట్లు, బాల్స్ పట్టుకుని సాంప్రదాయ క్రికెట్ ఆడుతూ ఎంజాయ్ చేశారు. ప్లేయర్స్ మధ్య ఉన్న పోటీతత్వం, హాస్యం ఈ సెషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొందరు ఇంగ్లాండ్ ఫుట్‌బాల్ ప్లేయర్స్ మైదానంలో అద్భుతమైన బ్యాటింగ్, ఫీల్డింగ్ స్కిల్స్ ప్రదర్శించారు.

**ఒత్తిడిని జయించేందుకే ఈ ప్లాన్:**
సుదీర్ఘమైన వరల్డ్ కప్ టోర్నమెంట్‌కు ముందు ఆటగాళ్లు మానసికంగా అలసిపోకుండా , జట్టులో ఐక్యతను పెంపొందించడానికి ఇలాంటి భిన్నమైన క్రీడలను ట్రైనింగ్ షెడ్యూల్‌లో చేర్చడం ఒక వ్యూహమని కోచింగ్ సిబ్బంది తెలిపారు. నిరంతరం ఒకే రకమైన ప్రాక్టీస్ చేయడం కంటే.. ఇలా కాసేపు వేరే ఆట ఆడటం వల్ల మైండ్ రిలాక్స్ అవుతుంది. ప్లేయర్స్ మధ్య బాండింగ్ కూడా పెరుగుతుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**నెట్టింట అభిమానుల కామెంట్స్ వర్షం:**
ఇంగ్లాండ్ ప్లేయర్స్ క్రికెట్ ఆడుతున్న వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా మా ఫుట్‌బాల్ హీరోలు క్రికెట్‌లోనూ సెంచరీ కొట్టేలా ఉన్నారు అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. స్టేడియం వెలుపల కనిపిస్తున్న ఈ సంతోషం, ఐక్యత.. 'త్రీ లయన్స్' (ఎష్ట్రతీవవ నాఱశీఅం) వరల్డ్ కప్ బరిలోకి దిగినప్పుడు కూడా కొనసాగి, జట్టుకు విజయాలను తెచ్చిపెట్టాలని ఇంగ్లాండ్ అభిమానులు ఆశిస్తున్నారు.

## ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లకు ముందు భారత్?కి షాక్.. గాయంతో సిరాజ్ ఔట్, అతడికి ఛాన్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో త్వరలో జరగబోయే టీ20 సిరీస్‌ల కోసం బీసీసీఐ జూన్ 6వ తేదీన భారత జట్టును ప్రకటించింది. గాయాలు, సీనియర్లకు విశ్రాంతి, సరికొత్త రికార్డులతో ఈ జట్టు ఎంపిక ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ఈ సిరీస్ ల కంటే ముందే భారత జట్టుకి బిగ్ షాక్ తగిలింది. ఇండియన్ స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ చీలమండ గాయంతో దూరం అయ్యాడు.



**కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్.. సూర్యకుమార్ కు రెస్ట్:**
ఈ జట్టు ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏంటంటే.. శ్రేయస్ అయ్యర్‌ను టీ20 జట్టుకు కెప్టెన్‌గా నియమించడం.. 2026 టీ20 వరల్డ్ కప్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో అయ్యర్ పగ్గాలు చేపట్టనున్నాడు. సూర్యకుమార్ ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అలాగే యువ ఆటగాడు తిలక్ వర్మకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు.

**మహమ్మద్ సిరాజ్ ఔట్.. ప్రసిద్ధ్ కృష్ణ ఇన్!**
భారత స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ గాయం కారణంగా ఈ రెండు టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 (ఖూూ 2026) ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ సందర్భంగా సిరాజ్ మడిమకు (ూఅనక్రీవ) గాయమైంది. ఆ నొప్పిని భరిస్తూనే అతడు ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడాడు. కానీ, రాబోయే సుదీర్ఘ అంతర్జాతీయ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని, అతడి వర్క్‌లోడ్‌ను మేనేజ్ చేయడానికి విశ్రాంతి తీసుకోవాలని బీసీసీఐ మెడికల్ టీమ్ సూచించింది. సిరాజ్ స్థానంలో గుజరాత్ టైటాన్స్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణను జట్టులోకి తీసుకున్నారు.

**సచిన్ రికార్డ్‌ను బద్దలు కొట్టిన వైభవ్:**
ఈ స్క్వాడ్ సెలెక్షన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన హైలైట్.. 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీకి టీమిండియా నుంచి పిలుపు రావడం. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆరెంజ్ క్యాప్ (రాఱఖఅస్త్రవ ఝఱజూ), మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (MVP) అవార్డులను గెలుచుకున్న వైభవ్‌కు జాతీయ జట్టులో చోటు దక్కింది.

**ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లకు భారత జట్టు:**
శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివం దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com